సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 8 । మే । 2024



బీజేపీకి బుద్ధిచెప్పాలి
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి గట్టి బుద్ధిచెప్పాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు అన్నారు. - IIలో



ప్రభుత్వ ఉద్యోగులపై నిఘా
ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ మీడియా అకౌంట్లపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక నిఘా పెట్టింది. - IIలో



వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



అంజనేయస్వామికి పాలాభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించి, సాయంత్రం వెండి జోడు సేవలు వంటి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'నియంతలా వ్యవహరిస్తున్న మోదీ'



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

చౌటుప్పల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నియంతలా వ్యవహరిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య ఆరోపించారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక కందాల రంగారెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ గెలుపును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య మనుగడకు, లౌకిక విలువల కోసం కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. దేశ ప్రయోజనాలు, ధరల తగ్గుదల, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు పార్లమెంట్‌లో కమ్యూనిస్టులు ఎక్కువ మంది ఉండాలన్నారు. సరళీకృత ఆర్థిక విధానాల విషయంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలన్నీ ఒక్కటేనని, అలాంటి విధానాలతో కార్పొరేట్ సంస్థలు మరింతగా బలోపేతం అవుతున్నాయన్నారు. ఫలితంగా రైతులు, కార్మికులు, వృత్తిదారులు ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వర్‌రావు, మున్సిపల్, మండల కార్యదర్శులు బండారు నర్సింహ, గంగదేవి సైదులు, నాయకులు ఆనగంటి వెంకటేశం, ఎండీ.పాషా, బత్తుల శ్రీశైలం, దండ అరుణ్‌కుమార్, గోపగోని లక్ష్మణ్, చింతల మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్, రమేష్, రాజశేఖర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శంకర్, తదితరులు ఉన్నారు.

టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

నల్లగొండ రూరల్ : టీఎస్ ఎడ్‌సెట్ 2024 దరఖాస్తులు ఈ నెల 10వ తేదీ వరకు పొడిగించినట్లు సెట్ కన్వీనర్ మృణాళిని తెలిపారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అపరాధ రుసుం రూ.250తో ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

గాలివాన బీభత్సం

- జిల్లా అంతటా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు
- నిలిచిన విద్యుత్ సరఫరా
- యాదగిరిగుట్ట ఆలయ ఆవరణలో ఎగిరిపడ్డ రేకులు



యాదాద్రి కొండపై గల క్యూకాంప్లెక్స్ పైభాగంలో కూలిన రేకులు

సాక్షి, యాదాద్రి: జిల్లా అంతటా సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. తీవ్ర ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగినా.. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు వర్షపు నీటిలో కొట్టుకుపోయాయి. సుమారు ఐదు లక్షల బస్తాలు కొనుగోలు చేశారు. ఇవి తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భువనగిరి, ఆలేరు, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, బీబీనగర్, పోచంపల్లి, మోత్కూరుతోపాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి.

యాదగిరిగుట్ట ఆలయంపై అతలాకుతలం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహుడి ఆలయంపై భక్తులు తాత్కాలిక టెంట్ కింద, మాడ వీధుల్లో తలదాచుకున్నారు. కొండపై ఈదురు గాలులుతో రేకులు ఎగిరి వాహనాలపై పడ్డాయి. చలువ పందిళ్లు కూలాయి. భక్తులు మాడ వీధుల్లో తిరుగవద్దని మైక్‌లో అనౌన్స్ చేశారు. భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు.



యాదాద్రి కొండపై కూలిన చలువ పందిళ్లు

రైతులకు నష్టం

ఆత్మకూర్ (ఎం), రాజాపేట, పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, బొమ్మలరామారం, ఆలేరు కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి ధాన్యం తడిసిపోగా, మరికొంత ధాన్యం కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన ధాన్యాన్ని రైతులు ఒక చోట చేరుస్తున్నారు. సకాలంలో కొనుగోలు జరగనందునే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. కాగా.. వర్షంతో తడిసిన ధాన్యంపై భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆరా తీశారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

రైతులు అధైర్య పడొద్దు

రైతులు అధైర్య పడొద్దని, ధాన్యం మొత్తం కొంటామని అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని, ఇప్పటివరకు లక్షా 75 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు చెల్లింపులు చేస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోలు కేంద్ర నిర్వాహకులు తమ సెంటర్లలో ఉన్న ధాన్యాన్ని, బస్తాలను టార్పాలిన్‌లతో కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



భువనగిరి పట్టణంలో రహదారిపై పారుతున్న వరద



ఆలేరు మండలం శారాజీపేటలో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలు



కొలనుపాకలోని కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం

రేపు భువనగిరికి అమిత్‌షా రాక

- రాయిగిరి వద్ద బీజేపీ బహిరంగ సభ
- సభావేదిక ఏర్పాట్లు, హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించిన నాయకులు



రాయిగిరి వద్ద సభాస్థలి మ్యాప్‌ను పరిశీలిస్తున్న బూరనర్సయ్యగౌడ్ తదితరులు

సాక్షి, యాదాద్రి: బీజేపీ భువనగిరి లోక్‌సభ ఎన్నికల ప్రచార వేగాన్ని పెంచింది. ఈమేరకు ఆపార్టీ జాతీయ నాయకులు రంగంలోకి దిగారు. ఇప్పటికే 6వ తేదీన చౌటుప్పల్‌లో జరిగిన బహిరంగ సభలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్నారు. ఇక ఈనెల 9న (గురువారం) రాయిగిరి వద్ద జరిగే బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రానున్నారు. సభాస్థలిని, భువనగిరి స్పిన్నింగ్ మిల్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ స్థలాన్ని బీజేపీ ఎంపీ అభ్యర్థి బూరనర్సయ్యగౌడ్, బీజేపీ ముఖ్య నేతలు పరిశీలించారు. వారి వెంట మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందామహేందర్‌గుప్త, ఎన్నం శివకుమార్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు మణికంఠ గౌడ్ ఉన్నారు.

అమిత్ షా పర్యటన ఇలా..

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గురువారం బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 10.45 గంటలకు భువనగిరిలోని హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడినుంచి 10.50కి రోడ్డు మార్గంలో కారు ద్వారా బహిరంగ సభ జరిగే రాయిగిరికి చేరుకుంటారు. 11 గంటల నుంచి 11.45 వరకు ప్రసంగిస్తారు. 11.55గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తాం

- బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల అసత్యపు ప్రచారాన్ని నమ్మొద్దు
- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి
- రాజగోపాల్‌రెడ్డి అభిమానులు త్వరలో శుభవార్త వింటారు
- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క



చౌటుప్పల్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చౌటుప్పల్, మునుగోడు : గతంలో ఆగిపోయిన పథకాలన్నింటినీ కొనసాగిస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చెప్పారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు చెప్పే అసత్య మాటలు నమ్మవద్దని ప్రజలను కోరారు. చౌటుప్పల్‌లో మంగళవారం రాత్రి కార్నర్ మీటింగ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దాంతో స్థానికంగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు మునుగోడులో నియోజకవర్గ ముఖ్యకార్యకర్తలు సమావేశంలోనూ భట్టి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తుందని, ఇప్పటికే హామీలు అమలు చేసి ప్రజల్లో చక్కటి ఆదరణ పొందామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు రాష్ట్రంలో రెండు సీట్లు వస్తే గగనమేనని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తనకు మైక్ ఇవ్వని సమయంలో రాజగోపాల్‌రెడ్డి ఎంతో ధైర్యం చెప్పేవారని అన్నారు. రాజకీయాలలో ఎంతో మంది డబ్బులు సంపాదించుకుంటారని, రాజగోపాల్ రెడ్డి మాత్రం ప్రజల కోసం ఖర్చు పెడుతున్నారని చెప్పారు. ఇలాంటి నాయకుడు రాష్ట్ర ప్రజలకు ఎంతో అవసరం అని అన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నమ్ముకున్న వారికి, తాను పనిచేస్తున్న పార్టీ కోసం అహర్నిశలు పాటుపడే రాజగోపాల్‌రెడ్డికి త్వరలో తగిన గౌరవం దక్కుతుందని, ఈ నియోజకవర్గ ప్రజలు త్వరలో శుభవార్త వింటారని భట్టి చెప్పారు. ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యంత మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని కోరారు.

భారీ మెజార్టీతో గెలవబోతున్నాం

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నల్లగొండ, భువనగిరి ఎంపీ స్థానాలను భారీ మెజార్టీతో గెలవబోతున్నామన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల ప్రచారం ఎక్కడా కనిపించడం లేదన్నారు. ఈ నెల 10న నకిరేకల్‌లో నిర్వహించే బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరుకానున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హామీలపై బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీ అసత్యపు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ నెరవేస్తుందన్నారు. అంతకు ముందు కార్యకర్తలు ఉప ముఖ్యమంత్రిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు బండ్ల గణేష్, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, పున్న కైలాస్ నేత, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చాయ్..

- పాఠశాలల ప్రారంభం రోజే పంపిణీకి సన్నాహాలు
- జిల్లాకు 3,07,910 పుస్తకాలు అవసరం
- ఇప్పటివరకు వచ్చినవి 83,490



భువనగిరి పట్టణంలోని పాత గ్రంథాలయ భవనంలో భద్రపరిచిన పుస్తకాలు

భువనగిరి: విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠ్య పుస్తకాలు అందజేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గత మూడు రోజులుగా పుస్తకాలు వస్తున్నాయి. వీటిని భువనగిరి పట్టణంలోని పాత గ్రంథాలయ భవనంలో భద్రపరుస్తున్నారు. వీటిని జిల్లాలో ఆయా మండలాలకు పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు టెండర్లు నిర్వహించి సరఫరా చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు.

జిల్లాకు చేరుకున్న 26.32 శాతం పుస్తకాలు

జిల్లాలో విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు పరిగణలోకి తీసుకుంటే ఇప్పటి వరకు కేవలం 26.32 శాతం వచ్చాయి. ఇంకా సుమారు 74 శాతం వరకు రావాల్సి ఉంది. జిల్లాలో మొత్తం 712 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 44,245 మంది విద్యార్థులు ఉన్నారు. వాస్తవానికి 3,12,442 పుస్తకాలు కావాల్సి ఉండగా గత సంవత్సరానికి సంబంధించి 4,532 పుస్తకాలు ఉన్నాయి. ఇవికాక జిల్లాకు మొత్తం 3,07,910 పుస్తకాలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు 83,490 పుస్తకాలు వచ్చాయి. 105 టైటిల్స్‌కు ఇప్పటివరకు 38 టైటిల్స్ వచ్చాయి. మొత్తం మీద ఈ నెల 7వ తేదీ నాటికి 26.32 శాతం పుస్తకాలు జిల్లాకు చేరుకున్నాయి.

ఈ నెలాఖరు వరకు పూర్తిగా వస్తాయి

గత మూడు రోజుల నుంచి విడతల వారీగా పాఠ్యపుస్తకాలు వస్తున్నాయి. ఈ నెలాఖరు వరకు పూర్తిగా వచ్చే అవకాశం ఉంది. పూర్తి స్థాయిలో పుస్తకాలు రాగానే మండలాల వారీగా పంపిణీ చేస్తాం. ఇందుకోసం ప్రణాళిక చేపట్టాం. ఇప్పటి వరకు 26 శాతం పుస్తకాలు వచ్చాయి.

– నారాయణరెడ్డి, డీఈఓ

రెండు భాషల్లో పాఠ్యపుస్తకాలు

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించే పాఠ్యపుస్తకాల్లో ఓ వైపు తెలుగు, మరో వైపు ఇంగ్లిష్‌లో ముద్రణ చేస్తోంది. తెలుగు భాష నుంచి ఇంగ్లిష్‌లో సులభంగా అర్థమవుతుందనే ఉద్దేశంతో ఇలా ముద్రిస్తున్నారు. ఈ క్రమంలో గత రెండేళ్ల నుంచి 3 నుంచి 9వ తరగతి వరకు ముద్రిస్తున్నారు. ఈ విధానం ఈసారి 10వ తరగతి వరకు అమలు చేస్తున్నారు.

నేటితో ముగియనున్న హోం ఓటింగ్

భువనగిరిటౌన్: 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల్లో హోంఓటింగ్, ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గడువు బుధవారంతో ముగియనుంది. జిల్లాలో మొత్తం 1,364 మంది ఓటర్లు హోం ఓటింగ్‌కు నమోదు చేసుకోగా.. ఇప్పటివరకు 1,237 ఓట్లు పోల్ అయ్యాయి. పోస్టల్ బ్యాలెట్‌కు నమోదు చేసుకున్న ఓటర్లు మొత్తం 13,213 మంది ఉండగా.. మంగళవారం 4,867 ఓట్లు పోల్ అయ్యాయి. మొత్తంగా ఇప్పటివరకు 8,065 ఓట్లు పోల్ అయ్యాయి. ఇంకా 5,148 ఓట్లు పోల్ కావాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు.

నాలుగు నెలల్లో.. నలభైఏళ్ల నరకం

- కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీలో వణుకు
- కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఒక్కటైన మోదీ, రేవంత్
- బీఆర్‌ఎస్ సమావేశంలో మాజీమంత్రి జగదీష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : నాలుగు నెలల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నలభై ఏళ్ల నరకం చూపెడుతోందని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ – ఖమ్మం – నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి నామినేషన్ వేసిన సందర్భంగా మంగళవారం నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జగదీష్‌రెడ్డి మాట్లాడారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేశారని, పార్లమెంట్ ఎన్నికలతోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా ఇంటింటి ప్రచారం చేసి కేసీఆర్ చేసిన సంక్షేమం పథకాలను వివరించి, కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీ, రైతుబంధు పెంపు, మహిళలకు నెలకు రూ.2500, యువతులకు స్కూటీలు, ఇందిరమ్మ ఇళ్లు, కేసీఆర్ కిట్టు ఇవ్వకుండా చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కేసీఆర్ బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీలకు వణుకు మొదలైందని, కేసీఆర్‌కు వ్యతిరేకంగా మోదీ, రేవంత్‌రెడ్డి ఒక్కటై బీఆర్‌ఎస్ గెలుపును అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బడేబాయ్ మోదీని గెలిపించేందుకు రేవంత్ కంకణం కట్టుకున్నాడన్నారు. గోదావరి నీటిని కావేరి నదిలో కలిపే కుట్ర చేస్తున్నారని, దీన్ని ఆపాలంటే కేసీఆర్‌తోనే సాధ్యమన్నారు. ఒకరు దేవుడిపై ఓట్లు వేస్తుంటే మరొకరు దేవుడి పేరుతో ఓట్లు అడుగుతున్నారని, కేసీఆర్ మాత్రం ప్రజలను నమ్ముకున్నాడని తెలిపారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారంతా చెట్టుకు పట్టిన చెదలు లాంటి వారని వ్యాఖ్యానించారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ 10 సీట్లు గెలవబోతుందని, పట్టభద్రుల ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మాజీమంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే నిరుద్యోగుల పక్షాన పోరాడుతారని తెలిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐదో సారి గులాబి జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగుల హక్కులపై పోరాడుతానని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తేస్తానని తెలిపారు. అనంతరం నల్లగొండలోని హైదరాబాద్ రోడ్ నుంచి వీటీ కాలనీ మీదుగా కలెక్టరేట్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎస్.భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్, తిప్పన విజయసింహారెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నోముల భగత్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, రాంచందర్‌నాయక్, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి, మందడి సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీగా వెళ్తున్న మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నాయకులు



నామినేషన్ వేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి

పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



ఓటరు చైతన్యం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

- కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి: పోలింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే నోడల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ విభాగాలకు చెందిన నోడల్ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజున చేపట్టే విధులపై సమీక్షించారు. రిపోర్టులను సకాలంలో సమర్పించాలని, పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మార్క్‌డ్ కాపీలు సిద్ధం చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం యంత్రాలు, సిబ్బంది కోసం బస్సులను సిద్ధం చేయాలన్నారు. అసెంబ్లీ సెగ్మెంట్ ప్రకారం కేటాయించిన వాహనాలకు జీపీఎస్ ట్యాగింగ్ నిర్వహించాలని చెప్పారు. భువనగిరి ఆరోరా కాలజీ, ఆలేరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటయ్యే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో వైద్య శిబిరాలు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓటరు చైతన్యం కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సలహాలు, సూచనల కోసం ఓటరు సహాయక కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 1950 వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ ప్రచార కార్యక్రమాల నోడల్ అధికారి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, వివిధ విభాగాల నోడల్ అధికారులు, యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శివలింగం, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

10న నకిరేకల్‌లో కాంగ్రెస్ సభ

- హాజరుకానున్న ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

నకిరేకల్: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం 10వ తేదీన నకిరేకల్ పట్టణంలోని మినీ స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం మినీ స్టేడియంలో సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే, స్థానిక నాయకులు పరిశీలించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

ప్రభుత్వ ఉద్యోగులపై ప్రత్యేక నిఘా

- పార్టీలు, అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేస్తే ఉద్యోగం ఊస్టే
- వారి సోషల్ మీడియా అకౌంట్లపై కూడా ఎలక్షన్ కమిషన్ డేగ కన్ను



భువనగిరి టౌన్: ఎన్నికల నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు సభలు, సమావేశాల్లో పాల్గొనరాదు. ఏదో ఒక పార్టీ కోసం పనిచేయడం లేదా ప్రచారం చేయకూడదు. ఆయా పార్టీలు, నేతలకు వ్యతిరేకంగా మాట్లాడరాదు. పోలింగ్ సమయంలో ఓటర్లను ప్రభావితం చేసినా వారి ఉద్యోగానికే ఎసరొచ్చే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ ఉద్యోగులపై ఎలక్షన్ కమిషన్ ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల సోషల్ మీడియా అకౌంట్లపై కూడా ఈసీ నిఘా పెట్టింది. తమకు నచ్చిన నాయకులకు మద్దతుగా తమ వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ అకౌంట్స్‌లో అప్ లోడ్ చేసినా, షేర్ చేసినా వారిపై వేటు తప్పదు. ఉద్యోగులు ప్రచారంలో పాల్గొన్నట్లు ఎవరైనా ఫొటోలు, వీడియో ఆధారాలతో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తే వారిని ఉద్యోగం నుంచి తొలగించే అవకాశం ఉంది.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

- రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ


అభివాదం చేస్తున్న రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి, సంకినేని తదితరులు

కోదాడ: దేశంలో గత పదేళ్లుగా నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అవినీతిరహిత పాలన అందించిందని, బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని, ప్రజలంతా మోదీకి అండగా నిలిచి మూడోసారి ప్రధానిని చేయాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ కోరారు. మంగళవారం కోదాడలో నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. గడిచిన 60 సంవత్సరాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని, వారి నుంచి దేశానికి విముక్తిని కల్పించి దశాబ్ద కాలంగా ప్రపంచంలోనే భారత్‌ను తిరుగులేని శక్తిగా మార్చిన ఘనత నరేంద్ర మోదీదేనన్నారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో ప్రజలు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో 15 సీట్లను బీజేపీ గెలుచుకోబోతున్నదని అన్నారు. 500 సంవత్సరాలుగా ఎవరికీ సాధ్యంకాని అయోధ్య రామ మందిరం సమస్యను నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ సర్కార్ పరిష్కరించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న మోదీ సర్కార్‌కు తెలంగాణ ప్రజలు కూడా అండగా నిలవాలని కోరారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకొని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. నల్లగొండ నుంచి శానంపూడి సైదిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి ఈ ప్రాంతానికి అవసరమైన ప్రాజెక్టులను తీసుకొస్తాడని అన్నారు. సూర్యాపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు బొబ్బా భాగ్యారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నల్లగొండ బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, నాయకులు సంకినేని వెంకటేశ్వరరావు, బొలిశెట్టి కృష్ణయ్య, పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, చాడ శ్రీనివాసరెడ్డి, సభాస్‌చందర్, మురగన్‌దాస్, చికోటి ప్రవీణ్, జుట్టుకొండ సత్యనారాయణ, నూనె సులోచన, మల్లెబోయిన అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించొచ్చు

- నల్లగొండ జిల్లా కలెక్టర్ హరిచందన

నల్లగొండ: ఓటరు గుర్తింపు కార్డు లేనివారు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గాను ఎన్నికల సంఘం అనుమతించిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి పోలింగ్ బూత్‌లో చూపించొచ్చని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆధార్ కార్డు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫొటో ఉన్న బ్యాంక్, పోస్టాఫీస్ పాస్‌బుక్‌లు, కేంద్ర కార్మిక శాఖ ద్వారా జారీ చేయబడిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా ఎన్‌పీఆర్ కింద జారీచేసిన స్మార్ట్ కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటో కలిగిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ సంస్థలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు వారి ఉద్యోగులకు జారీచేసిన ఫొటో గుర్తింపు కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీచేసిన అధికారిక గుర్తింపు కార్డు, కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ దివ్యాంగ కార్డులలో ఏదో ఒకదానిని గుర్తింపుకార్డులుగా చూపవచ్చని తెలిపారు.

ఈవీఎంల పరిశీలన


సింబల్ లోడెడ్ యూనిట్ స్టోరేజీని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

నల్లగొండ: కలెక్టరేట్ ఆవరణలో గల ఈవీఎంల గోదామును, సింబల్ లోడెడ్ యూనిట్ స్టోరేజీలను మంగళవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన పరిశీలించారు. ఆమె వెంట అధికారులు ఉన్నారు.

పట్టభద్రుల స్థానానికి 14 మంది నామినేషన్

నల్లగొండ: వరంగల్– ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నామినేషన్లలో భాగంగా మంగళవారం 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య, అలియన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి ఈడ శేషగిరిరావు, శ్రమజీవి పార్టీ నుంచి జాజుల భాస్కర్ , యువతరం పార్టీ నుంచి బండారు నాగరాజు నామినేషన్లు వేశారు. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థులుగా అయితగోని రాఘవేంద్ర, పిడిశెట్టి రాజు, పూజారి సత్యనారాయణ, మారం వెంకట్ రెడ్డి, గుగులోతు బీమా, డాక్టర్ పెంచాల శ్రీనివాస్, కంటే సాయన్న, దైద సోమసుందరం, అల్వాల కనక రాజు నామినేషన్ వేశారు. ములుగు జిల్లా అదనపు కలెక్టర్, వరంగల్– ఖమ్మం– నల్లగొండ శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిహెచ్.మహేందర్‌జి నామినేషన్లు స్వీకరించారు.

తండ్రీకొడుకులు చెమటోడుస్తున్నారు..!





నిడమనూరు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎండ వేడిమికి తట్టుకోలేక మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి కూడా ప్రచార రథంపై చల్లటి నీరు తాగుతూ కనిపించారు. అదేవిధంగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి తలపై నీటిని పోసుకుంటూ ఉపశమనం పొందగా.. నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి తలకు కండువా కట్టుకుని, మజ్జిగ ప్యాకెట్లు తాగుతూ వేడి నుంచి బయటపడే ప్రయత్నం చేశారు. – నిడమనూరు

కార్మికవర్గం ఎన్నికల్లో బీజేపీకి బుద్ధిచెప్పాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు


సదస్సులో మాట్లాడుతున్న మధు

తుంగతుర్తి : దేశంలో మత ప్రాతిపదికన పాలన సాగించాలని చూస్తున్న బీజేపీకి కార్మిక వర్గం గట్టి బుద్ధిచెప్పాలని, కార్మిక హక్కులకు అండగా నిలిచిన ఎండీ జహంగీర్‌ను గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ‘పార్లమెంట్ ఎన్నికలు– కార్మికుల కర్తవ్యం’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కోట్లాదిమంది అసంఘటిత రంగ కార్మికులు ఉన్నారని, వారికి కనీస వేతనాలు చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పోరాడి సాధించిన 44కార్మిక చట్టాలలో 29చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధానాలను అమలు చేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చే కుట్ర ఇప్పటి నుంచే చేస్తుందన్నారు. సదస్సులో యల్క సోమన్న, చెరుకు యాకసోమన్న, యాక లక్ష్మి, అనంతరం మల్లయ్య, రాధాకృష్ణ, శ్రీనివాస్, వచ్చే సైదులు, శేఖర్, మన్సూర్, వెంకన్న, సతీష్, పరశురాం, శ్రీను, విజయ్, యాదగిరి, చంద్రకళ, శోభ, ఉమ, అనిత పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి


తన వాహనంలో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి క్రైం: బీబీనగర్ మండలం గుర్రాలదండి గ్రామ ఆవాసం చోక్లాతండాకు చెందిన వినోద్‌కుమార్ భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్ చౌరస్తాలో మూర్ఛవ్యాధితో ద్విచక్రవాహనం పైనుంచి కింద పడిపోయాడు. అదే సమయంలో అటుగా ఎన్నికల ప్రచారం నిమిత్తం వెళ్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రమాదాన్ని గమనించి బాధితుడిని వెంటనే తన వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాధితుడి ఆరోగ్య పరిస్థితి పర్యవేక్షించాల్సిందిగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చిన్నా నాయక్‌కు సూచించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

భువనగిరి క్రైం : రైలు కిందపడి గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండలంలోని పగిడిపల్లి గ్రామ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వేస్టేషన్ మధ్య 238/11–13 మైలురాయి వద్ద ఎగువలైన్‌లో వెళ్లే వందేభారత్ రైలు కిందపడి సుమారు 35సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వంటిపై లైట్ బ్లూ జీన్స్ ప్యాంట్, పసుపు పచ్చ బ్లూ చెక్స్ షర్టు, మెడలో నల్లదారం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. వివరాలకు 8712568454, 8712658719ను సంపాదించాలన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్ : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లెఓవర్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడనే సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు సుమారు 45ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్ 8712670150, 8186865497 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి

ఆత్మకూరు (ఎస్) : విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృతి చెందాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఏపూరి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరాల లింగయ్య తన ఎద్దులను మేపడానికి పొలంలోకి వదిలాడు. అవి మేతమేసుకుంటూ వెళ్లి అప్పటికే పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో రెండు ఒకేసారి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. వాటి విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైరు అపహరణ


దుండగులు పగులగొట్టిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

పాలకవీడు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి విలువైన కాపర్ కోర్‌ను దుండగులు అపహరించుకుపోయారు. ఈ ఘటన మండల కేంద్రం పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం నుంచి నేరేడుచర్ల వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి వెంట వ్యవసాయ విద్యుత్ 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. రాత్రి గుర్తుతెలియని దుండగులు పలు ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి ఉండటాన్ని ఉదయం అటుగా వెళ్లిన రైతులు గుర్తించారు. ఏబీస్విచ్ బంద్ చేసి వైర్లు కత్తిరించి దిమ్మెలపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను కిందపడేసి వాటి లోపలి విలువైన సామగ్రిని అపహరించుకుపోయినట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసులు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించామన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆయా శాఖల అధికారులు వివరాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

ఓటు వేయాలని ‘ఆహ్వానం’

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఇన్విటేషన్ కార్డు

భువనగిరిటౌన్: ఓటు హక్కు ఉన్న వారందరూ లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయడానికి రావాలంటూ రూపొందించిన ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ప్రజాస్వామ్య పండుగ పేరిట రూపొందించబడిన ఈ ఆహ్వాన పత్రిక వాట్సాప్ గ్రూపుల్లో తిరుగుతోంది. ఓటర్లందరూ కుటుంబ సభ్యులతో కలిసి తప్పనిసరిగా ఓటు వేసేందుకు తరలిరావాలని అందులో పేర్కొన్నారు. పోలింగ్ తేదీ, వేళలను వేడుక సమయంగా, పోలింగ్ స్టేషన్‌ను వేదికగా, ఐదేళ్ల ప్రజాస్వామ్య ఫలాలను విందుగా అందులో సూచించారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే ఆహ్వాన పత్రిక రూపొందించినట్లు చివర్లో పేర్కొనడం విశేషం.



అంధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

- సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకటరావు


ఈవీఎంపై బ్రెయిలీ లిపిని పరిశీలిస్తున్న సూర్యాపేట కలెక్టర్ ఎస్. వెంకటరావు

సూర్యాపేట: లోక్‌సభ ఎన్నికల్లో అంధులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకటరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంధుల ఓటు హక్కు వినియోగంపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. 13 తేదీన జరిగే పోలింగ్‌లో అంధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాలలో వీల్ చైర్స్, ర్యాంప్‌లు, బ్యాలెట్ పేపర్, ఈవీఎంపై బ్రెయిలీ లిపి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 2,193 మంది అంధ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వి. వెంకటరమణ, బ్రెయిలీ లిపి ట్రైనర్ శ్రీనివాస్, సీడీపీఓలు కిరణ్మయి, శ్రీవాణి, సాయిగీత, పారిజాత, రూప, హేమ, అంధుల సంక్షేమ సంఘం ప్రెసిడెంట్స్ వెంకటయ్య, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ..

ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేందుకు గాను బుధవారం ఉదయం 8గంటలకు సూర్యాపేట పట్టణంలోని మెడికల్ కాలేజీ వద్ద నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్. వెంకటరావు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. స్విప్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఆంగ్ల పత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సౌజన్యంతో ఈ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమాలని ఉల్లంఘించరాదని, కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

ఖర్చుల వివరాలు ప్రతిరోజు సమర్పించాలి


నకిరేకల్ : అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలను పరిశీలిస్తున్న సయాన్ దెబ్బర్మ

నకిరేకల్: అభ్యర్థుల ప్రచారాలకు సంబంధించిన ఖర్చుల వివరాలను ప్రతిరోజు ఏఆర్‌ఓ కార్యాలయంలో సమర్పించాలని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు సయాన్ దెబ్బర్మ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన నకిరేకల్‌లోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌ఓ) కార్యాలయాన్ని సందర్శించి ఆయా మండలాల ఎక్స్‌పెండీచర్ టీంలతో సమావేశమయ్యారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఏఆర్‌ఓ టి. పూర్ణచంద్ర, తహసీల్దార్ జమీరుద్దీన్, డీఎస్పీ సైదా తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఖర్చుల తనిఖీ..

నల్లగొండ: కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో మంగళవారం నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కళ్యాణ్ కుమార్ దాస్ ఎంపీ అభ్యర్థుల రెండో విడత ఖర్చుల తనిఖీ నిర్వహించారు. మొత్తం 22 మంది అభ్యర్థులకు గాను 19మంది అభ్యర్థులు హాజరై వారికి సంబంధించిన ఖర్చుల రిజిస్టర్లు, రికార్డులను, రిపోర్టులను ఆయనకు సమర్పించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి రిపోర్టులతో పాటు ఏబీసీ ఫార్మాట్లను పరిశీలించి షాడో రిజిస్టర్‌తో పోల్చి చూశారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యయ పరిశీలకుడు కె. సురేష్, ఎన్నికల ఎక్స్‌పెండిచర్ నోడల్ అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

- మృతుడు రాజస్థాన్ రాష్ట్ర వాసి

కొండమల్లేపల్లి : ఉరివేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రంలోని బియావర్ జిల్లా పాట్వా గ్రామానికి చెందిన ప్రజాపతి సోహన్‌లాల్, కమ్లి దంపతుల 3వ కుమారుడు రాకేశ్(24) రెండు సంవత్సరాలుగా కొండమల్లేపల్లిలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాకేష్ మూడు నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి ఈనెల 6న మండల కేంద్రానికి వచ్చాడు. తన పాత యజమాని అయిన సందే కిరణ్‌కు ఫోన్ చేసి మళ్లీ షాపులో పనిచేస్తానని ఇక్కడే ఉంటానని అడగడంతో తాను అందుబాటులో లేనని కిరణ్ తెలిపాడు. అయితే దుకాణం తాళాలు ఇవ్వాల్సిందిగా రాకేశ్ కోరగా కిరణ్ తన దుకాణం నుంచి తాళాలు తీసుకొమ్మని చెప్పాడు. మరుసటి రోజు తాళం తీయకపోవడంతో అనుమానం వచ్చిన కిరణ్ షాప్ తెరిచి చూడగా రాకేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు మృతుని బాబాయి ప్రకాష్‌చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- 21 లీటర్ల నాటుసారా, 50కిలోల బెల్లం స్వాధీనం


సారా, బెల్లం తరలిస్తూ పట్టుబడిన నిందితులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా విక్రయిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 3ద్విచక్ర వాహనాలు, 21లీటర్ల సారా, 50 కిలోల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మటంపల్లి మండలంలోని కొత్తదొనబండ తండాకు చెందిన బానోత్ బాలు తన ద్విచక్ర వాహనంపై 8లీటర్ల సారా తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించిన పట్టుకుని సారాతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా మేళ్లచెరువు మండలం వెల్లటూరు కాలనీకి చెందిన దాసు నరసమ్మ టీవీఎస్ వాహనంపై 8లీటర్ల సారా తరలిస్తుండగా సారాతో పాటు వాహనం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు, అదే మండలం సాధుతండాకు చెందిన ధరావత్ లింగ, ధరావత్ రంగమ్మ మోటార్ సైకిల్‌పై 5లీటర్ల సారా, 50కేజీల బెల్లం తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్ట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. అంతే కాకుండా వివిధ మండలాల్లో పలు కేసుల్లో ఉన్న 22మందిని ఆయా మండలాల తహసీల్దార్ల వద్ద బైండ్ ఓవర్ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు జగన్మోహన్‌రెడ్డి, దివ్య, వెన్నెల, గోవర్ధన్, సిబ్బంది పేర్కొన్నారు.

రైతులు భూసార పరీక్ష చేయించుకోవాలి


మట్టి నమూనా సేకరణ విధానం గురించి వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్త కిరణ్

పెన్‌పహాడ్ : ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించుకోవాలని కేవీకే మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నూర్జహాన్‌పేట గ్రామంలో భూసార పరీక్షల్లో భాగంగా మట్టి నమూనా సేకరించే విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి రైతు తమ నేల భూసారాన్ని తెలుసుకొని దానికి అనుగుణంగా ఎరువులు వాడాలని, తద్వారా ఎరువుల వాడకంలో అనవసర ఖర్చులు తగ్గించి భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు పొందవచ్చని, భూసార పరీక్షలు చేయడంతో పోషకాల పరిమాణం కాకుండా భూమిలోని చౌడు, సున్నం శాతాన్ని గుర్తించవచ్చన్నారు. రైతులు తమ పొలంలోని మట్టిని సేకరించి కేవీకే గడ్డిపల్లికి పంపిస్తే భూసార పరీక్ష చేసి భూ ఆరోగ్య పత్రాలు అందజేస్తామన్నారు. మట్టి నమూనాలు సేకరించే విధానానికి 7893989055కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కేవీకే సిబ్బంది బచ్చు వెంకటేశ్వర్లు, రైతులు జనుపుల శ్రీను, ధరావత్ మస్తాన్, బాణోతు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, బాణోతు విజ్జ తదితరులు పాల్గొన్నారు.